# ఇంటర్ ఫలితాల్లో పురోగతి సాధించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇంటర్మీడియట్ ఫలితాల్లో గణనీయమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, గత పరీక్షల ఫలితాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత పరీక్షల ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫలితాల్లో తప్పనిసరిగా మెరుగుదల ఉండాలని, గత సంవత్సరం కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాలని స్పష్టం చేశారు. అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం కళాశాలలు, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టుల్లో ఫెయిల్ శాతం ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేలా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. విద్యా బోధనను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు అనుభవజ్ఞులైన లెక్చరర్లతో ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఆదేశించారు. ఈ ప్యానెల్ బృందాలు కళాశాలలను సందర్శించి బోధన విధానం, విద్యార్థుల పురోగతిని సమీక్షిస్తాయని తెలిపారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, సెక్టోరల్ అధికారి ప్రత్యూష, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ చర్చలు సఫలం

**సత్తుపల్లి బస్టాండ్లో కార్మికుల సంబరాలు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమవ్వడంతో సత్తుపల్లి బస్టాండ్లో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని కార్మికులకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు విజయవంతం కావడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కార్మికులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణంపై సంతాపం వ్యక్తం చేసి, ఆయన కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్య నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సై పాత్ర కీలకం



**ఉద్యమ కెరటం, సిరికొండ:** శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సై పాత్ర ఎంతో కీలకమని సిరికొండ సర్పంచుల సంఘం అధ్యక్షుడు దత్తాత్రి అన్నారు. సిరికొండ పోలీస్ స్టేషన్లో గత తొమ్మిది నెలలుగా ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై పూజకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండల కాంగ్రెస్ పార్టీ, స్థానిక సర్పంచుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సై పూజ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండటం ఆమె ప్రత్యేకతగా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ ప్రవీణ్, సుంకిడి సర్పంచ్ గణపతి, సోంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, సిరికొండ ఉప సర్పంచ్ టి.రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ ఇమామ్, మైనార్టీ చైర్మన్ రంజాన్, ఆలం గజానంద్, సంజీవ్, రామారావు, జిల్లా భూమన్న, షేక్ పతి, ఇరుగదిండ్ల ఎల్లన్న, రవి,, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# వ్యాపారం పేరుతో ప్రజలకు టోకరా

- పెట్టుబడి పేరుతో కోట్ల రూపాయల మోసం
- ప్రధాన నిందితురాలు శివరంజని బాయి అరెస్ట్
- పరారీలో మరి కొంతమంది నిందితులు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నితిక పంత్



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్ టౌన్:** కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో "డివైన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ" పేరిట నకిలీ వ్యాపారం నిర్వహిస్తూ ప్రజలను పెట్టుబడులు పెట్టమని నమ్మబలికి భారీ నగదు మోసాలకు పాల్పడిన కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు ఠాకూర్ శివరంజని బాయిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. నిందితులు 5 నుంచి 20 శాతం వరకు అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపించి బాధితుల వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మొత్తం రూ.1 కోటి 8లక్షల మోసం జరిగినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ–1 ఠాకూర్ కరణ్ సింగ్, ఏ–2 ఠాకూర్ రతన్ సింగ్, ఏ–3 ఠాకూర్ రవీందర్ అలియాస్ లడ్డూ సింగ్, ఏ–5 ఠాకూర్ రాణా సింగ్ పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఏ–4 ఠాకూర్ శివరంజని బాయిను ఈనెల 24న సికింద్రాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు వివరించారు. పోలీసుల విచారణలో కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, లల్లగూడ, హైదరాబాద్ సీసీఎస్ పరిధిలో కూడా పలు మోసపు కేసులు ఉన్నట్లు బయటపడిందన్నారు. ఈ కేసుల్లో కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. నిందితురాలిని కోర్టులో హాజరు పర్చగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగితా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన డీఎస్పీ వాహిదుద్దీన్, ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఎస్సై రాజు, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మి , జ్యోత్స్న, బ్లెస్సి, శమీనా, కానిస్టేబుల్ విజయ్‌ను ఎస్పీ అభినందించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతానికి కీలక మార్పులు

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** యాసంగి 2025-26 సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌లో కీలక మార్పులు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలోని రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు జరగనుందని, ప్రతి మిల్లుల సామర్థ్యాన్ని ఆధారంగా తీసుకొని ధాన్యం కేటాయింపు ఆటోమేటిక్‌గా జరిగే విధంగా వ్యవస్థను ఆధునీకరించామని తెలిపారు. ఇకపై మాన్యువల్ ట్రక్ షీట్ విధానం ఉండదని, పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ట్రక్ షీట్ జనరేట్ అ వుతుంద ని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం, మిల్లుల మధ్య డేటా ఆటోమేటిక్‌గా అ నుస ంధాన ం అవుతుందని చెప్పారు. జిపిఎస్ పరికరాల ద్వారా ధాన్యం లారీలు మార్గం తప్పకుండా పర్యవేక్షించబడతాయని తెలిపారు. రైతుల వివరాలను ఆధార్ ఆధారంగా ధృవీకరించి, భూమి విస్తీర్ణం, పంట వివరాలు సరిచూడాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే గోనె సంచులు అందించాలని పేర్కొన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని జిపిఎస్ కలిగిన వాహనాల్లో మాత్రమే తరలించాలని స్పష్టం చేశారు. ఓపీఎంఎస్ ద్వారా ట్రక్ చిట్ జనరేట్ అవుతుందని, మిల్లుల కేటాయింపు పూర్తిగా ఆటోమేటిక్‌గా జరుగుతుందని వివరించారు. మిల్లర్లు ధాన్యం స్వీకరించిన వెంటనే ఆన్‌లైన్‌లో అంగీకారం ఇవ్వాలని, అనంతరం రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయబడుతుందని చెప్పారు. రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

# బాధిత కుటుంబానికి ఆడే గజేందర్ పరామర్శ




**ఉద్యమ కెరటం, తాంసి:** తాంసి మండల కేంద్రానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ మునేశ్వర్ అనిల్ పాటిల్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ శనివారం మృతుడి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న యువ ఉద్యోగి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5వేల నగదును అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

# మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ




ఉద్యమ కెరటం, తాండూర్: మలేరియా దినోత్సవం పురస్కరించుకొని శనివారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నర్సాపూర్ సబ్ సెంటర్ పరిధిలోని ఎంవీకే–3 గ్రామంలో వైద్య సిబ్బంది మలేరియా నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన మెడికల్ క్యాంపులో 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో మాదారం త్రీఇంక్లైన్ గ్రామ సర్పంచ్ చందనాల రవికుమార్, తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, తాండూర్ మండల వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ రాణి, ఎస్యూఓ శ్రీనివాస్, సీహెచ్ఓ సత్తయ్య, సూపర్వైజర్లు తారాబాయి, రమాదేవి, ఎంవీకే–3 గ్రామపంచాయతీ సెక్రటరీ కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడిగా రాంప్రసాద్



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** బెజ్జూర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా తుమ్మలగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సర్పంచుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. మండలంలోని 22 మంది సర్పంచులకు గాను 12 మంది సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కొండ రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సోయం చిన్నయ్య, ఉపాధ్యక్షులుగా తోర్రం చిరంజీవి, మన్యంపల్లి మల్లే ష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సెండ్ పద్మ, పెగడపల్లి సరిత, సంయుక్త కార్యదర్శులుగా కుమ్మరి రామకృష్ణ, ఏనుక శ్రీహరి, కోశాధికారిగా ధారావత్ కవితను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా నందిపేట రాజయ్య, కొడప శంకర్, తేలి సుశీల లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కోనేరు కోనప్ప బలపర్చిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులు 9 మంది, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బలపర్చిన పాపన్నపేట్ సర్పంచ్ అభ్యర్థి దూరంగా ఉన్నట్లు తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఆడే గజేందర్ పరామర్శ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన గెడం జ్యోతిరామ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదం జరిగిన తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆరేపల్లి సర్పంచ్ రవీందర్, లింగట్ల సర్పంచ్ మల్లేష్ పటేల్, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ సింగ్, మాజీ ఎంపీపీ సాబ్లే ప్రేమ్ సింగ్, సిడం భూమన్న పటేల్, గోడం బాపూరావ్ పూజారి, ఎండి సద్దాం, గోడం యదోరావ్, గోడం లక్ష్మణ్, బానోవత్ రవి, పంద్రం శ్రీకాంత్, మాజీ సర్పంచ్ సిడం గంగాప్రసాద్, మాజీ సర్పంచ్ నాగేష్, వార్డు సభ్యులు కొట్నాక్ భీంరావు, దుర్వ సోనేరావు, మడవి భూమన్న, లక్ష్మణ్ ఉయక, లక్ష్మణ్ కుమ్ర, యదోరావ్, దుర్వ కుష్టు తదితరులు ఉన్నారు.

